# 26. చట్టాలు – చుట్టాలు

"రాకరాక మమ్మల్ని చూడాలని కాకపోయినా, కనీసం వ్యాపారపు మిషతోనన్నా వచ్చావు. ఆ వ్యాపారం మొదటి రోజునే పూర్తయింది కనుక మర్నాడే వెళ్తానని కూర్చున్నావు! కనీసం మూడు నిద్దర్లయినా చేయందే వెళ్ళేందుకు వీల్లేదు!" అని మిత్రబృందంలోని నలుగురూ బలవంతం చేయటంతో రాజు ప్రయాణం నాలుగో నాటికి వాయిదాపడక తప్పలేదు.

మిత్రులన్న మూడు నిద్దర్లూ ఆహ్లాదకరంగా – వెన్నెల రాత్రుల్లో పరదేశాల్లో తయారైన అమృతపానాలతో హాయిగా దొర్లిపోయినవి. ఉమ్మర్ ఖయ్యాం అడుగుజాడల్లో కాలం గడిపి, ఆ మహానుభావుడి వేదాంతసారాన్ని సరాసరి రక్తంలోకి ఎక్కించుకోవటం జరిగింది. అవతలి తొందర వేధించకపోతే మరో పది నిద్దర్లన్నా చేసి వుండేవాడే రాజు. ఆదర్శాలకూ, నిత్య జీవిత విధానాలకీ లంకెలు కుదరని దుస్థితిలో నాలుగో నాటి మెయిల్‌కు ప్రయాణపు ఏర్పాట్లు జరిగినవి.

అదృష్టవశాత్తూ ఫస్ట్‌క్లాస్ కూపే కంపార్ట్‌మెంట్‌లోని లోయర్ బెర్త్ రిజర్వేషన్ రాజుకు దొరికింది. అప్పర్ బెర్త్‌లో అప్సరస లాంటి నవ యవ్వని ఉంటే ఇక ఆ ప్రయాణపు రాత్రి కూడా ఉమ్మర్ ఖయ్యాం అపర అవతారంగా గడుస్తుంది కదా అని ఎంతో సంబరపడ్డాడు రాజు.

మెయిల్ దగ్గిరికి వెళ్ళేదాకా అప్పర్ బెర్త్ పాసింజర్ విషయం తేలదు. ఒక వేళ మరో 'మొగ పురుగే' తనకు పై భాగాన ఉండే పరుపుల మీద పవళిస్తే కనీసం ఉమ్మర్ ఖయ్యాం వేదాంతసారంలో సగమన్నా అనుసరించే అవకాశాన్ని జారవిడవరాదు.

మద్రాసులో వ్యాపారపు చికాకుల్లో సరైన స్థలమూ, తగిన మిత్రుల దండూ రెండూ కరువైనందువల్ల తన సరదాలన్నీ యీ దూర తీరంలోనే తీరే అవకాశం పుష్కలంగా ఏర్పడింది. ఈ సదవకాశాన్ని ఏ విధంగానూ దుర్వినియోగపరచుకోని తృప్తి ఉన్నది మిత్రులన్న మూడు నిద్రలకూ. ఈ నాలుగో నిద్ర రైలులో ఆ మూటికి కొంతవరకన్నా తోడుగా గడిపితే మంచిదనిపించింది.

ఐతే ఈ ప్రభుత్వపు చట్టాలు తనను తనలాంటి లక్షలాది పౌరులను చట్టం పేరిట చట్రంలో బిగించిపారేసినవి. కన్నుగప్పి చేజిక్కించుకున్నదే దక్కుదల! స్వతహాగా రాజు చట్టవిరుద్ధంగా ప్రవర్తించే సద్గుణమున్న వ్యక్తి కాడు. కాని వ్యక్తిగతమైన వాంఛలు తీరేందుకు కొన్ని సందర్భాలలోనన్నా వేరువిధంగా నడవక తప్పదు.

అందుకని ఆ ఫారిన్ జిన్ సేవిస్తూ ప్రయాణపు బడలిక తెలియరాకుండా ఆ రాత్రి రైలులో గడిపేందుకే నిశ్చయించుకున్నాడు రాజు. ఇటువంటి అసలు సరుకు చవిచూసి ఎన్నాళ్ళయిందో! చెల్లించే వెల కూడా అత్యధికమేం కాదు. వేగంగా ప్రయాణం చేస్తూ ఈ 'సుధ' ను సేవిస్తూంటే అదొక నూతనానుభవం కూడాను! ఏదొచ్చీ ఎవరికంటా పడకుండానూ, తాగి పట్టుబడకుండానూ సమర్థించుకోగలిగితే మరే ఇబ్బందీ ఉండదు.

అసలే ఫస్ట్ క్లాస్! తలుపులు బిడాయించుకొని కూర్చుంటే రాత్రి పూట మరెవ్వరూ చివరకు టికెట్ చెకింగ్‌వాళ్ళు కూడా డిస్టర్బ్ చేయరు. కూపే కంపార్టుమెంట్ కనుక తాను కన్ను కప్పాల్సింది - మరొక్క ప్రయాణీకుణ్ణి మాత్రమే!

ఇటీవలనే వ్యాపారంలో విపరీతమైన లాభాలు వచ్చి ఉండటం వల్ల దేశాచారాన్ని అనుసరించి, ఆ ముదనష్టపు సొమ్ములో కొంత భాగం ఏడుకొండలవాడికి అనుకున్న ప్రకారం మొక్కు చెల్లించు కోవటమే గాక, నెత్తిన ఉన్న బొచ్చు కూడా సమర్పించుకున్నాడు. భారీగా, హుందాగా, కళకళ్ళాడుతూండే తన స్వరూపానికి యీ బోడిగుండు చంద్రునికో మచ్చవలె తోచటంతో, మళ్ళీ బొచ్చు పెరిగేదాకా దాన్ని కప్పి ఉంచేందుకు గాంధీ టోపీ కొనుక్కున్నాడు. ఈ కొత్త అవతారం నిజంగానే తన పెద్దమనిషితనాన్ని ఎన్నో రెట్లు పెంచింది.

"ఎవరో గొప్ప కాంగ్రెస్ నాయకుడు ఓట్ల ముష్టికి బయలుదేరినట్లు--" అన్నారు ఇక్కడి మిత్రులు తనని చూడగానే! ఏ పవిత్రోద్దేశంతో బాపూజీ యీ టోపీనీ కనిపెట్టినప్పటికీ, దీని బురఖాలో మంత్రుల దగ్గర్నుంచీ, మిండగాళ్ళవరకూ అందరూ దేశోద్ధారకుల్లాగే కనిపించే ఏర్పాటూ, సమానత్వాన్ని నిరూపించే అద్భుత శక్తీ మేళవించింది! దీని చాటున ఎంత పెద్ద తప్పయినా ఒప్పుగానే భ్రమింపజేసే గోసాయి చిట్కా ఉండనే ఉన్నదనే విషయం మనకు స్వాతంత్రం వచ్చినప్పటి నుంచీ స్వతంత్రంగానే తెలుసుకునే అనేక సందర్భాలను తెలుసుకోనివారు అరుదు! ఈ టోపీ

ప్రపంచానికే పెద్ద టోపీగా పరిణమించింది!

బోడిగుండును కప్పేందుకు వాడుకున్న గాంధీ టోపీ తాలూకు వివిధాలైన ఉపయోగాలు ఇప్పుడు రాజు జీవితంలో తారసిల్లినవి. మొట్ట మొదటిసారి పూజ్య బాపూజీకి మనస్సులోనే అనేక నమస్కారాలూ, ధన్యవాదాలూ అర్పించుకున్నాడు రాజు!

ఈ రూపంలో తానొక కాంగ్రెస్ నాయకుడల్లే కనిపించటం వల్ల తనను ప్రస్తుతానికి ఈశ్వరుడు కూడా పట్టలేడు - సందేహించలేడు!

ప్రపంచంలోని ఏడు వింతలకూ మరోటి కలపాల్సి వొస్తే నిష్పేచీగా 'గాంధీ టోపీ'ని అంగీకరించక తప్పదు!

బుడ్లు బుడ్లుగా వెంట తీసుకొని వెళ్ళటం ఎంత కాంగ్రెసు నాయకుడికైనా తగని పని అని తెలుసుకొన్న రాజు రెండు పెద్ద ప్లాస్టిక్ వాటర్ బాటిల్స్ కొని, వాటినిండా జిన్ నింపుకొని ప్రయాణంలో దాహం (!) తీర్చుకొనే మొదటి తరగతి ప్రయాణీకుడల్లే, అన్ని కోణాల్లోనూ చూపరులకు తోచే విధంగా జాగ్రత్తపడ్డాడు! జిన్ మంచినీళ్ళలాగే ఉంటుంది కనుక చూపులతో దాన్నెవరూ పట్టుకోలేరు!

## 2

బండి బయలుదేరేందుకు అరగంట ముందరే వచ్చి లోయర్ బెర్త్ మీద బెడ్డింగు పెట్టించి, సామానులు కింద తోయించి, పరమ పవిత్రమైన గంగాజలమున్న రెండు ప్లాస్టిక్ వాటర్ బాటిల్స్‌నూ ఎదురుగా ఉన్న హుక్స్‌కు తగిలించాడు రాజు.

అప్పర్ బెర్త్‌ను ఆక్రమించేది ఒక మొగ పురుగనే విషయం రిజర్వేషన్ కార్డులో చూసి, తన స్వప్నం సగం భంగమయినందుకు విచారమూ, మిగతా సగమన్నా సత్యమౌతూన్నందుకు సంతోషమూ కలిగాయి అతనికి.

మిత్రులతో జోక్స్ వేస్తూ ఫ్లాట్‌ఫారమ్ మీదనే నిలబడి వన్నెల విసనకర్రలు చూపుమేర దూరంలో కనిపిస్తారేమోనని గుచ్చి గుచ్చి నలువైపులా పరికించసాగాడు రాజు. ఎక్కడన్నా అల్లంత దూరాన అలాంటి అందాల రాసులు చూపులకు తగిలినా వాళ్లను తలచుకొని లొట్టలు వేయటం తప్ప చేసేది ఏమీ లేదనే విషయం అతని మనస్సులో కలుక్కుమంటూనే ఉన్నది.

బండి బయలుదేరేందుకు మొదటి గంట మోగించారు. తన తోటి ప్రయాణీకుని జాడ లేదు. అదీ ఒకందుకు మంచిదే! తానొక్కడే హాయిగా తాగి తందనాలాడుతూంటే తన బొందిని తెల్లారేప్పటికి మద్రాసు జేర్చేందుకు మెయిల్ పరుగెత్తుకొని పోతూనే ఉంటుంది! లేదా తాను ఊహించినట్లుగా ఏ సుందరాంగికన్నా చోటు దొరక్క, ఏ రైల్వే ఆఫీసరో యీ కంపార్ట్‌మెంట్‌లోకి తోస్తే, ఆమెకు టిక్కెట్టున్నా లేకున్నా తాను

సంతోషపూర్వకంగా ఆమెను యీ రాత్రికి మాత్రం స్వీకరించి స్వర్గానికి బెత్తెడు తక్కువదాకా తోసుకు తోసుకు పోగలుగుతాడు.

ట్రాలీ నిండుగా సామానుతో ఒక ముసలాయన ఆదరా బాదరా వస్తున్నాడు. డార్విన్ థియరీని రుజూ చేసేందుకు అవతరించిన వ్యక్తిగా గోచరించే యీ ముసలాడు తనకు తోటి ప్రయాణీకుడు కాదు కదా?..ఆలోచన తెగకపూర్వమే తన కంపార్ట్‌మెంట్ దగ్గరే ట్రాలీ ఆగటంతో రాజు ఒక్క నిట్టూర్పు విడిచాడు.

కూలీలు ఆదరా బాదరాగా సామానులు సర్దుతున్నారు. ముసలాయన హడావిడిపడుతూ ఏది ఎక్కడ ఎలా పెట్టాలో పురమాయిస్తూ ఆయాస పడుతున్నాడు. ఆయన తెచ్చిన సామానులు మహా బరువనే విషయాన్ని రుజూ చేసేందుకు ఒక్కో పెట్టెను ఇద్దరు, ముగ్గురు కూలీలు కూడా ఎత్తవలసి వస్తోంది.

“పెట్టెలు మెల్లిగా దింపండి... జాగ్రత్త!.. నీకే చెప్పేది--” అని అరుస్తున్నాడు ముసలాడు.

రెండో గంట కూడా కొట్టారు. ఇంకా సగం సామానులన్నా ఎక్కాల్సి వుంది; ముఖ్యంగా ముసలాయన ఎక్కాలి. బండి బయలుదేరితే లోపలికి ఉరికేందుకు రాజు సిద్ధంగా ఉన్నాడు.

అండర్ గార్డు గార్డుకు పచ్చదీపం చూపుతున్నాడు. గార్డ్ ఈల వేస్తున్నాడు. యీ ముసలాయన సగం సామాను ప్లాట్‌ఫారం మీద ఉండి పోవటమూ, ఆయన తాలూకు మిగతా సగం సామానుతోనూ తాను ప్రయాణం చేయవలసిరావటమూ ఊహించుకుంటే రాజుకు చికాకు కలిగింది. ముసలాడిని చూస్తే జాలి కలిగింది. కాని అది క్షణికమే!

ఇంతలో ఏం జరిగిందో కాని గార్డ్ ఈల ఆగిపోయింది. పై పెచ్చు ఎర్రదీపం కన్పించగానే అండర్ గార్డ్ కూడా ఎర్రదీపం వేశాడు. కూత వేసిన ఇంజన్ ఆవిరి వదులుతోంది. డ్రైవర్ ప్లాట్‌ఫారం మీద నిలబడి పోయాడు.

రణగొణ ధ్వనిగా ఉన్న ప్లాట్‌ఫారాన్ని ఒక్క క్షణం నిశ్శబ్దం ఆవరించింది. మెయిల్‌లో ప్రయాణం చేసే తమ బంధుమిత్రులకు వీడ్కోలు చెప్పేందుకు గాను బైటికి తీసిన జేబురుమాళ్ళూ, కొద్ది కొద్దిగా ఊపులంకించుకున్న వాటితో సహా అచేతనాలైనవి.

ఇంతలో ఒక పోలీసు ఆఫీసర్ ముసలాయన దగ్గరికి పెద్ద పెద్ద అంగలు వేసుకుంటూ వచ్చాడు. ముసలాయన సామానులు తనిఖీకి వసున్న ధోరణి రాజుకు కనిపించింది. అదే నిజమైతే తన సామానులు కూడా తనిఖీ చేయవలసి రావటమూ, ముఖ్యంగా ప్లాస్టిక్ వాటర్ బాటిల్స్ బండారం బైట పడటంతో కాంగ్రెస్ నాయకుడల్లే ఉన్న తన చేతులకు బేడీలు వేసి (వీటి ఒత్తిడికి గత మాసంలో తాను కొన్న స్మగుల్డ్

గోల్డు వాచ్ పగలకుండా జాగ్రత్తపడాలా? లేక అది మరొక నేరం కింద ఒప్పేసుకోవాలో తెలియటం లేదు) ఊరేగింపు జరిగితే, కాంగ్రెస్ ప్రతికక్షీయులూ, ప్రభుత్వమంటే ఒళ్ళు మండిపోతున్న జనావళీ రోడ్డుమీద ఉమ్మి వేయరూ! (ఉమ్మి రాకున్నా సరే!)

ఈ దుస్థితి తలుచుకుంటే వంటిమీద గొంగళి పురుగులు పాకుతున్నట్లనిపించింది రాజుకు! అంతగా గొంతుమీదికి వస్తే తాను మొదటి తరగతి ప్రయాణీకుడు కానట్లు ఫోజు వేసి జారుకోవచ్చనుకున్నాడు.

కాని తన సామానులు సోదా చేస్తే మాత్రం ఈ పోలీసుల బలగం తనను పట్టుకోగలదు! ఒక్క ప్లాస్టిక్ వాటర్ బాటిల్స్ మినహాగా తాను నేరస్థుడు కాడు. అంతగా వస్తే అవి కూడా ముసలాడివేనని తప్పించుకోవచ్చు.

"అసలే ఆయాసంగా ఉన్నదన్నారు. తొందరేం లేదు. ఐదు నిమిషాలు బండి ఆగుతుంది--" అన్నాడు పోలీసు ఆఫీసర్.

"థాంక్స్!" అన్నాడు ముసలాడు.

ఆ తరువాత కూలీల చేత ఏది ఎక్కడ పెట్టించాలో అక్కడ పెట్టిస్తూ ముసలాడు కుదుటపడ్డాడు. యీ ముసలాడి పలుకుబడి రాజుకు బాగా అర్థమైంది. బయలుదేరే మెయిలు బండినే ఆపించాడు! పోలీసు ఆఫీసర్లతో పరిచయమున్నదో, లేక ఈయన కూడా ఒక పెద్ద పోలీసు ఆఫీసరో రాజుకు తెలియలేదు. ఏమైనా ఈయనతో మాటలు కలిపి పరిచయం, వీలైతే స్నేహం చేసుకోవటం మంచిదనిపించింది రాజుకు.

పోలీసు ఆఫీసర్ చేయి ఎత్తి సౌజ్ఞ చేయటంతో గార్డ్ ఈల వేసి ఆకుపచ్చ దీపం చూపటం, అందరు గార్డు అనుసరించి 'రైట్' చెప్పటం జరగటంతో ప్లాట్‌ఫారం మీద జేబురుమాళ్ళు గాలిలోకి లేచి మెయిల్‌కు ఘనమైన వీడ్కోలు ఇచ్చినవి.

పట్టాలమీద లయగా చక్రాలు చేసే శబ్దం మినహాగా మరేమీ వినిపించని ఘట్టం ఆరంభమవగానే రాజు "మీరు పెద్దవారు. పైకి ఎక్క లేరు. లోయరు బెర్తులోనే ఉండండి. నేను పైకి వెళ్తాను" అన్నాడు.

తన బెడ్డింగు పైన పారేసి రాజు లోయర్ బెర్త్‌లోనే ముసలాడికి ఎదురుగా సుఖంగా ఆసీనుడయ్యాడు. ముసలాడు పుస్తకం చదువుకునే ఏర్పాట్లలో ఉన్నాడు. రాజు ముసలాణ్ణి పరీక్షగా చూశాడు.

జన్మతః ఉత్తమ వంశీకుడై ఉండాలి. కిష్కింధావాసుని ముఖమైనా, ఆ ముఖంలోని తేజస్సూ, కళ్ళల్లోని కాంతీ చూస్తే ఈ దేశంలోని మహా మేధావుల కోవకు చెందినవాడై ఉండాలి. గొప్ప ఉద్యోగమో, లేక వ్యాపారమో, లేక పలుకుబడో ఏదో బాగా చెప్పుకోదగ్గది ఈయనకు ఉండి ఉండాలి. తనంతట తాను కల్పించుకొని మాట్లాడినా ముభావంగా ఊరుకున్నందుకు ముసలాడి మీద కాస్త చరచరమంది. అంతమాత్రానికే నిరాశపడే తత్వం కాదు రాజుది!

"మీ వంట్లో బాగాలేదనుకుంటాను!" అన్నాడు రాజు.

తన ఆరోగ్యం మీద శ్రద్ధ చూపే వ్యక్తిని చూసేప్పటికి ముసలాడి ముఖం వికసించింది.

"ఆస్త్మా... మైల్డ్ ఎటాక్, కాస్త ఆయాసంగా ఉంది అంతే!" అన్నాడు ముసలాడు.

"మందేమీ తీసుకోలేదా?"

"తీసుకున్నాను. బాగా నిద్ర పడితే బాగుండును. మత్తు పదార్థాలు ఏ బ్రందీయో, విస్కీయో ఉంటే ఎంత బాగుండునో కదా అనిపిస్తుంది. ప్రొహిబిషన్ లేనప్పుడు యీ సమస్యలే లేవు. కనీసం నాలాటి రోగిష్టివాళ్ళకు ప్రొహిబిషన్ చట్టాలు అమలుకాకుండా ఉంటే --"

ముసలాడు కూడా మందు పుచ్చుకునే అలవాటున్న వ్యక్తేనని అర్థమైంది. తాను ఊహించిన పలుకుబడీ, హెూదా మొదలైనవి నిజంగానే ఆయనకు ఉంటే పర్మిట్ తెచ్చుకోవటం, లేదా అదీ లేకుండానే తన పలుకుబడి ప్రభావంతో హాయిగా తాగటం చేసి ఉండేవాడు కదా! తాను తాగుతానని నలుగురికీ తెలియకుండా ఉండాలని ఆయన ఆశయమేమో? లేక పర్మిట్ ఉంటే తాగుబోతుగా తయారౌతాననే భయమేమో? లేక తనను పరీక్షించేందుకు యీ ఎత్తు ఎత్తాడేమో? ముఖ్యంగా తన గాంధీటోపీ చూసి, తనకు రాజకీయమైన పలుకుబడి అత్యధికంగా ఉన్నదని అపోహపడి, యీ ప్రభుత్వ విధానాల మీద ఉండే తన ద్వేషాన్ని విమర్శనాపూర్వకంగా ప్రయోగించేందుకు నాందీప్రస్తావనగా యీ ధోరణి ప్రారంభించాడేమో?

అందుకనే రాజు ముసలాడి మాటలు పూర్తి కాకుండానే "తమలాటి మేధావులు యీ వింత ధోరణిలో మాట్లాడతారనుకోలేదు. మీ ఆయాసం తగ్గేందుకు 'దాక్షాసవ" లాటి మందులు లేవా? ప్రొహిబిషన్ ఉండబట్టే ముఖ్యంగా బీదసాదల కొంపల్లో శాంతిభద్రతలు నెలకొల్పబడినవి!" అన్నాడు.

"ఔనౌను. చాలామంది బీద సాదల ఇళ్ళల్లో సారాబట్టీలు నెలకొల్పబడి, వారి స్థితిగతులు కాస్త మంచి స్థాయిని అందుకున్నవి! దినదినాభివృద్ధి జెందే జాతీయ పరిశ్రమ ఇదొక్కటే!" అని అంటించాడు ముసలాడు.

ముసలాడు ప్రొహిబిషన్ మీద దండయాత్రకు నడుం బిగించాడనేది రాజుకు స్పష్టంగా తెలిసింది. తనక్కూడా యీ పాడు ప్రొహిబిషన్ మీద మంటగానే ఉన్నది; కాని ముసలాడి అసలు రూపురేఖా విలాసాలేమిటో ఆకళింపు చేసుకోకుండా ముందుకు సాగి, తన నిజ రూపాన్ని బైటపెడితే, ఎలాటి ఇబ్బందులపాలు కావలసి వస్తుందోననే భయం రాజును పీడిస్తోంది. కనుకనే ప్రొహిబిషన్‌ను నెత్తిన పెట్టుకొని ఆ విధానాన్ని సమర్థించేందుకు రెండో కొనలో కాపు వేశాడు.

"మీరు ఎత్తిపొడుపుగా మాట్లాడుతున్నారే కాని, నిజానికి ప్రొహిబిషన్ వల్ల ఎంత మేలు జరిగిందో గమనించటంలేదు" అన్నాడు రాజు.

"మంత్రుల అంచనాల ప్రకారమా?"

"లేదండీ. నా మిత్రుల్లో తాగుడు అలవాటున్నవారు చాలామంది మానేశారు. అసలు దొరకటం లేదాయె!"

"అసలు సరుకు దొరక్కనే నకిలీ సరుకు తాగి ఆరోగ్యాన్ని చెడగొట్టుకున్నారండీ!" అన్నాడు ముసలాడు.

"లేదండీ, చట్టం ఉన్నది. అనవసరంగా నేరస్థుడయేందుకు ఇదేమన్నా సరదాయా! అదీగాక రేట్లు ఎంత పెరిగినయ్! సంపాయించేది తినేందుకే సరీపడీ సరిపడకుండా ఉంటే తాగటం ఎలా కుదురుతుంది?"

"అయ్యా! తాగాలని వాంఛే ఉండాలి కాని తాగేందుకు డబ్బూ దొరుకుతుంది; సరుకూ దొరుకుతుంది. మీ మిత్రుల్ని గూర్చి చెప్పారు కదూ! నాకూ ఉన్నారు మిత్రులు. వాళ్ళల్లో తాగుడుకు అలవడినవాడు ఒక్కడూ మానలేదు. కొత్తవాళ్ళు చాలామంది ముఠాలో జేరారు. దానికేమంటారు?" అని సవాలు విసిరాడు ముసలాడు.

ఇది కాచివడబోసిన సత్యమని రాజుకు తెలిసినా తన వాదాన్ని బలహీన పరుచుకునేందుకు ఒప్పుకోలేదు.

"అలాంటివారుంటే తమబోటి పెద్దలు మందలించాలి. పూజ్య బాపూజీ ఆత్మశాంతి కోసమన్నా తాగరాదని ఉత్తేజకరంగా ప్రబోధించాలి. ఏవిధంగానూ తాగుడ్ని ప్రోత్సాహపరచరాదు!" అని బాపూజీ ఆత్మ శాంతి గుర్తుకు రాగా, ప్లాస్టిక్ బాటిల్ నుంచి ఒక గ్లాసు పోసుకుని మింగాడు; అది చాలక తన ఆత్మ శాంతి కోసం మరో గ్లాసు కూడా పుచ్చుకొని వాసనా, గీసనా రాకుండా వక్కపొడి బొక్కాడు రాజు!

"బాపూజీ ఆదర్శాలకూ, ఆయన ఆత్మశాంతికి తగిన వెలలు యీ నాడు మనం చెల్లిస్తూనే వున్నాం. ఇదివరకు ఆ తాగేవాడెవడో చెల్లించుకునే పన్నులు, ఇప్పుడు తాగని నేరాలకు గాను, తాగనివారు యిచ్చుకుంటూనే ఉన్నారు. దొంగచాటుగా జింజిబరీస్ లాటి పానీయాలు తాగి ఛస్తున్నారు!" అన్నాడు ముసలాడు రుసరుస లాడుతూ.

జింజిబరీస్ పేరు వినగానే రాజుకు ఒళ్ళు జలదరించింది. మద్రాసులో తనకు అదే గతి! దాన్ని మరచిపొయ్యేందుకు మరొక గ్లాసు 'భారతమాతకూ జై!' అనే ధోరణిలో పుచ్చుకుంటే బాగుంటుందా అనుకుంటున్నాడు.

"మీరు ఎన్నన్నా చెప్పండి. స్వాతంత్ర్యం వచ్చాక మనం బాగుపడ్డాం!" అన్నాడు రాజు.

"పంచవర్ష ప్రణాళికా ఫలితాలు చూశాక చాలా బాగుపడ్డామనే అనుకుంటున్నాం! ఎందుకొచ్చిన రభస లెండి!" అన్నాడు ముసలాడు.

అమృతం వెంటనుండగా ఊపిరితిత్తులు అలసిపొయ్యేటట్లు యీ వెధవ వాద ప్రతివాదా లెందుకు? భారత మాతను మరొక్కసారి స్మరించుకొని మరొక్క గ్లాసు జిన్ తాగేప్పటికీ రాజు హృదయం జిల్ మని భూమికి మూరెడు పైగా ఉన్నట్లు తోచింది.

"నాక్కూడా కాసిని మంచినీళ్ళివ్వండి!" అన్నాడు ముసలాడు.

రాజు గతుక్కుమన్నాడు. జిల్‌మన్న అతని హృదయం గడ్డకట్టుకు పోతున్నట్లు తోచింది. ఇలాటి ప్రమాదాల నుంచి యిదివరకు అనేకసార్లు తప్పించుకోగలిగిన ప్రతిభ ఉన్న వ్యక్తి కనుక తొణకకుండా "ఇవి మంచి నీళ్ళు కావండీ!" అన్నాడు.

"మరేమిటి?" అన్నాడు ముసలాడు కనుబొమలు పైకి ఎత్తి

"కషాయం స్వామీ! కషాయం!... ఆ మధ్య టైఫాయిడ్ పడ్డాక మద్రాసులోని ఒకానొక ప్రముఖ ఆయుర్వేద భిషగ్వరుని ఆదేశానుసారం గంట గంటకూ ముఖ్యంగా ప్రయాణాల్లో తాగేందుకు నిర్దేశించబడింది. పాడు వగరూ చేదు కూడాను. అందుకనే" అని ఒక గుప్పెడు వక్కపొడి నోట్లో వేసుకుని "యీ వక్కపొడి తినటం!" అన్నాడు. 'నీ బోటి శల్య పరీక్ష కారుడికి చిక్కకుండా వుండేందుకు!' అని మనసులో అనుకున్నాడు.

ఈ అస్త్రం ప్రస్తుతానికి పారింది. ముసలాడు తన దృష్టిని పుస్తకం మీద కేంద్రీకరించాడు. ఈ ముసలాడికి అసలే ఆయాసం, తన ఖర్మకాలి ఆ ఆయాసం మరికాస్త ఎక్కువైతే ఏదో ఒక ద్రవపదార్థం లేనట్లయితే మరీ బాధపడతాడు. తన దగ్గిరున్న యీ ద్రావకాన్ని సేవించే పక్షంలో, మొదటి పుక్కిటిలోనే తన రంగు తెలిసిపోతుంది, అదీ గాక ఇలాటివి అలవాటు లేని మేళాం కనుక ఐతే కంపార్టుమెంటు నిండా కక్కినా కక్కవచ్చు!

మాటల ధోరణిని బట్టి అడపా దడపా యిలాటి పానీయాలతో నోరు తడుపుకునే రకమని అర్థమైంది. ప్రొహిబిషన్‌కు విముఖుడనే విషయం కూడా ఆయన మాటల్లో స్పష్టమైంది.

ఐతే ప్రొహిబిషన్‌కు ఎంతో సుముఖత్వాన్ని ప్రదర్శించి బాపూజీ పవిత్రాశయాలను నెత్తికెత్తుకొని హెూరాహెూరీగా పోరాడిన తను యీ ద్రావకాలను సేవిస్తూన్న సంగతి ముసలాడు రుచి చూసీ చూడగానే గ్రహించి... ఇందాకట్నించీ వెధవ వాదాలు చేసిన తన మీద కసి తీర్చుకునేందుకు గొలుసు లాగి రైలు ఆపినా ఆపవచ్చు. వెనువెంటనే తనను పోలీసులకు అప్పగిస్తే తన పరువు ప్రతిష్ఠలు ఏం కావాలీ? పలుకుబడి ఉన్న వ్యక్తికి పట్టుబడటమంటే అగ్నిగుండంలోకి ఉరకటమే అవగలదు!

అలాటి దుస్థితి వచ్చి పడితే ఆ వాటరు బాటిల్స్ తనవి కావనీ, ముసలాడివేననీ బుకాయించవచ్చు. కాని తన నోటి నుండి వెలువడే సువాసనా, ముప్ఫై సంవత్సరాల నాడు స్కాట్‌లెండ్ యార్డు వారు అనుసరిస్తున్న డిటెక్షన్ పద్ధతులను నేడు అనుసరిస్తున్న భారతీయ డిటెక్టివ్‌లు నిశితంగా పరీక్షించి, బాటిల్స్ మీది వేలిముద్రలు తనవేనని రుజూ చేయటంతో నేరం నిస్సందేహంగా తనపై పడి రుజూ అవుతుంది. యీ వెధవ జిన్ లేకుంటే మానె ఇంత రాద్ధాంతం జరుగుతుందనే ఊహన్నా ఉన్నట్లయితే యీ సాహసానికి చాలా దూరానే ఉండేవాడు కదా!

పావుగంట గడిచాక ముసలాడి వైపు చూశాడు రాజు. ముసలాడికి ఆయాసం కాస్త ఎక్కువైంది. ఆయన దృష్టి తన వాటరు బాటిల్స్ మీదనే నృత్యం చేస్తున్నట్లు తోచింది,

ఈసారి మళ్ళీ నీళ్ళు (!) అడిగే ధోరణి ముసలాడి పట్ల కనిపిస్తోంది. అడిగితే ఏం చేయాలి? త్వరత్వరగా వాటరు బాటిల్స్‌లోని అమృతాన్ని అవపోసన పట్టి ఖాళీ బాటిల్స్‌ను కిటికీలోంచి విసిరేస్తే? అంత త్వర త్వరగా పీల్చిపారేసేందుకు తానేం అగస్త్యుడా! రాత్రంతా హాయిగా సిప్ చేస్తూ ఆనందిస్తూ గడపాల్సిన దాన్ని 'మింగు-మింగు' అనే ధోరణిలో ఐతే తనకు తిక్క తిరిగి బూతుపాటలు లంకించుకునే అపాయం కూడా ఉన్నది! తాగినందుకూ, బుడ్లు మోసినందుకూ, తందనా లాడినందుకూ మూడు సెక్షన్లూ రాజు మొహం మీద వేళ్ళాడసాగినవి.

రొప్పుతూ "అయ్యా! కాసిని మంచి నీళ్ళివ్వండి!" అన్నాడు ముసలాడు.

ఈ బాంబు పేలి తీరుతుందనే తెలుసు రాజుకు.

"అవి మంచినీళ్ళు కావండీ...కషాయం క-షా-యం!" అని విడిగొట్టి వికారం ఉట్టిపడేవిధంగా తెలియజెప్పాడు రాజు.

"ఏదో వొకటి. గొంతెండి ఛస్తుంటే ఏం చేస్తాం? ఇవ్వండి!" అని దబాయించాడు ముసలాడు.

"అది మందు స్వామీ! వ్యాధికి ఉపయోగపడేదాన్ని మంచి నీళ్ళవలె తాగుతానంటే ఏం చెప్తాను? నా మాదిరి రోగమే మీకు ఉంటే తప్పు పని చేయదు... మొండికేసి తాగితే ప్రాణాపాయం కూడాను!" అన్నాడు రాజు.

"ఇలా.. ఇలా... ఆయాసంతో బాధపడటం కన్నా ఆ కషాయం తాగన్నా ప్రాణాలు వదలటం... మంచిదనిపిస్తోంది... గొంతులోంచి ద్రవ పదార్థం ఏదో వొకటి జారకుంటే ప్రాణాలు నిలవవు. కషాయం కానీ, విషం కానీ ఫర్వాలేదు! ఎలాగూ ప్రాణాలు పొయ్యే పక్షంలో తాగకుండా చావటం కన్నా, తాగి చావటమే మేలు!"

సరాసరి తన ప్రాణానికే ఎసరుపెట్టిన విధంగా ఉన్న దా ధోరణి! రాజుకు ఎటూ తోచలేదు. ఒక మానవ ప్రాణి తృష్ణతో ప్రాణాపాయ స్థితిలో ఉంటే చూస్తూ ఊరుకోవటమెలా? ఊరుకోక ఉరి వేసుకోవట మెలా? ముసలాడి మీద జాలి కలిగింది, కాని తన బండారమంతా బైటపడి తన గాంధీ టోపీ విలువ బజారుపాలు కావటానికి ఎలా అంగీకరించగలడు?

తిరిగి తిరిగి యీ ముసలాడు తన వెంట పడకుండా ఉండే విధంగా కాస్త కఠిన స్వరంతోనే "అలా ఇచ్చేందుకు వీల్లేదండీ! కషాయ మని చెపుతూంటే వినిపించుకోరేం? ఇవ్వను ఇవ్వలేను, క్షమించండి!" అన్నాడు; ఆ చివరి మాటతో తన సంస్కృతిని వ్యక్తపరిచాడు.

ముసలాడు కనుబొమలు ముడివేశాడు యీ జవాబు విని!

ఈ ముసలాడికి దాహం తీరక ఢామ్మని ఛస్తే? తాను కోర్టు చుట్టూ తిరిగి సాక్ష్యం చెప్పటం, తన వాటర్ బాటిల్స్‌లోని లొఠారమంతా బట్టబయలు కావటం, తనలాటివాళ్ళను చూసిన బాపూజీ ఆత్మ ఘోషించటం కాంగ్రెస్‌కే చెడుపేరు రావటం మొదలైన అనేక దుర్భర పరిస్థితులను ఎదుర్కోవలసి వస్తుంది. ముసలాడికి తాను చెప్పిన 'విషం-కషాయం' నిజంగానే తన పాలిట విష కషాయాల రూపులు దిద్దుకునేట్లున్నవి!

ఏ వెధవ గొడవా లేకుండా ఇప్పుడే ఈ రెండు వాటరు బాటిల్స్‌నూ కిటికీలోంచి విసిరి పారేస్తే? బోలెడు డబ్బు పోసి కొన్న నిఖార్సయిన ఫారిన్ సరుకు! ఒక బాటిల్ రైలులోకీ, రెండోది ఇంటికీ అని తన అంచనా! ఒక బాటిల్‌లో నాలుగో వంతు మాత్రమే మింగాడు ఇప్పటికి!

ఈ ముసలాడు శని దేవతల్లే తన వెంట పడతాడని ఊహించి వుంటే ఒక కూజా నిండా నీళ్ళు కూడా వెంట తెచ్చి ఉండేవాడు! కనీసం తనతో పాటు తోడుగా కూర్చుని గొడవ లేకుండా ఈ అమృతాన్ని సేవించటానికి పూనుకున్నా ఎంతో సంతోషించేవాడు! ఎటు కదిలితే ఏం ప్రమాదమో!

ఈ ఆయాసం కూడా తనకు అగ్ని పరీక్ష వలె యిప్పుడే దాపరించాలా ముసలాడికి? ఆయాసం తన నొక్కణ్నే బాధపెడుతోందని ముసలాడు భ్రమ పడుతూన్నాడు. అంతకన్న ఎక్కువగా ఏ ఆయాసమూ లేని తాను బాధపడుతూన్న సంగతి ఆయనకు తెలియదు పాపం!

పోనీ గొలుసు లాగి రైలాపి ముసలాడికి సోడాయో, మంచినీళ్లో యిప్పిస్తే? తాను ఎందుకు గొలుసు లాగిందీ తెలుసుకున్నాక తన వాటర్ బాటిల్స్ రహస్యం పరిశోధించబడకుండా ఉంటుందా? ముసలాడొక్కడికీ బురిడీ వేసినంత తేలికగా

తన కంపార్టుమెంట్ చుట్టూ జేరినవారిని మోసగించ గలడా? ఏ గొడవా లేకుండా నిద్రపోతే? అప్పుడు ముసలాడు ఆత్రం కొద్దీ తన అమృతాన్ని కషాయంగా తోచినా సరే మింగేస్తే? సరుకు నష్టమౌతుందని కాదు - తన సరుకు బైట పడుతుందని!

ఉపాయాలు తోచక ముభావంగా మొహం ముడుచుకొని కూర్చున్నాడు రాజు.

మరో అరగంటక్కాని మెయిల్ ఆగే స్టేషన్ రాదు. మెత్తని పరుపుల మీద కూర్చున్నా రాజుకు ముళ్ళకంప మీద కూర్చున్నట్లే ఉంది. ఈ బాధాకరమైన విషమ పరిస్థితి నుంచి తాత్కాలికంగా విడుదలయ్యేందుకు మరొక్క గ్లాసు పానీయం పట్టిస్తే బాగుండుననిపించింది; ఐతే అసలే దాహంతో నాలిక పీక్కుంటున్న ముసలాడు తాను తాగే కషాయాన్ని చూస్తే మరింత తృష్ణతో అలమటించిపోతాడేమోనని ప్రస్తుతానికి ఆ ప్రయత్నం నుంచి విరమించుకోవలసి వచ్చింది.

ముసలాడి వంక చూడట మంటేనే భయంగా ఉంది. రొప్పుతూ మెలికలు తిరుగుతూన్నాడు! యిలాటి రోగిష్టివాడితో ప్రయాణం చేయవలసి రావటం నిజంగానే తన దురదృష్టం; కూపే కాకుండా ఏ ఆరు బెర్తులున్న కంపార్టుమెంటన్నా ఐ వుంటే ఏ ప్రయాణీకుని దగ్గరో యిన్ని మంచినీళ్ళు దొరక్కనూ పోవు; తానీ దుర్భర పరిస్థితుల్లో యిరుక్కోకనూపోను కదా!

"నాకు... దాహం... మీ... పర్మిషన్ లేకుండానే... తాగేస్తాను... నా కీ ... ఫార్మాలిటీస్... పనికి... రావు!" అన్నాడు ముసలాడు.

తృష్ణార్తుని ఆరాటాన్ని అర్థంచేసుకోలేనంత తక్కువ రకం సంస్కృతి కాదు రాజుది! తాను అన్నట్లుగా ఆ బాటిల్స్‌లోది కషాయం ఐనా యిచ్చేవాడే! జిన్ (మత్తు పదార్థం) కాకుండా ఏ యితర ద్రవపదార్థమైనా పట్టింపు లేదు. చివరికి జిన్ ఐనా పర్వాలేదు అది తాగాక ముసలాడు తనను నేరస్థుడుగా చేస్తాడేమోననేదే రాజును పీడించే భయం

ముసలాడి మాటలకు విసురుగా గోడకు తగిలిన కొత్త టెన్నిస్ బంతిలాగు ఎగిరిపడ్డాడు రాజు.

"అలా వీల్లేదండీ!" అన్నాడు రాజు. "నా మందేదో మీరు తాగేస్తానంటా రేమిటి? ఆయాసం ఉండగా ఒక కూజాతో నీళ్ళు తెచ్చుకోలేక పొయ్యారా?... నా సామానుల్ని మీరు తాకేందుకు వీల్లేదు. అలాటి ప్రయత్నం చేస్తే నే నీ బాటిల్స్‌ను విసిరి బైటికి పారేస్తాను! ఆ కషాయం తాగితే ఏదన్నా ప్రమాదం జరిగినా జరగవచ్చు. దానికి నేను పరోక్షంగా కూడా బాధ్యత వహించ లేను!"

తాను యింతకు తక్కువ కఠినంగా మాట్లాడితే శృతిమించి రాగాన పడుతుందనే జ్ఞానముంది రాజుకు. అందుకనే ముసలాడు తన అవస్థ తాను పడసాగాడు.

## 3

మెయిల్ ఇంకా ఆగిందో లేదో రాజు ప్లాట్‌ఫారం మీదికి ఉరికి సోడా స్టాల్‌వైపు పరుగెత్తి "రెండు మంచి సోడాలు!" అన్నాడు.

రాజును తేరిపార జూచిన స్టాల్ వాడు "స్పెషల్ సోడాలు ఇమ్మంటారా?" అన్నాడు.

"ఇయ్యవయ్యా!" అని రాజు పది రూపాయిల కాగితం ఇచ్చాడు.

స్టాల్‌వాడు రహస్యంగా ఉండే సొరుగు లోంచి రెండు బుడ్లు తీసి రాజుకు ఇచ్చాడు. రాజు పరుగు పరుగున వచ్చి సోడాలు కొట్టి గ్లాసులో పోసి ముసలాడికి అందించాడు. ముసలాడు కృతజ్ఞతాపూర్వకంగా రాజు వైపు చూసి ఒకదానివెంట మరొకటి గడగడా తాగేసి, తేపి, ఆయాసం తగ్గిన ధోరణి కనబరిచాడు.

ముసలాడు సోడాలు తాగుతుండగా ఆ ద్రవం తెల్లగా గాక కాస్త ఎర్రగా ఉండటాన్ని రాజు గమనించాడు. ఐతే స్పెషల్ సోడాలు కనుక ఇలా వున్నవేమోనని అంతగా పట్టించుకోలేదు.

"చాలునా? మరో రెండు తెమ్మంటారా?" అన్నాడు రాజు.

"చాలండీ! ప్రాణాలు నిలబెట్టారు మొత్తంమీద!" అని ముసలాడు అనేప్పటికి, రాజుకు ఎంతో ఆనందమై తన గాంధీ టోపీని ఒక్కసారి సవరించుకున్నాడు.

ఖాళీ బుడ్లను స్టాలువాడికి ఇచ్చాక, స్టాలువాడు ఎనిమిది రూపాయి నోట్లు తిరిగి రాజుకు అందించి తన పని చూసుకోసాగాడు.

"మిగతా చిల్లరా?" అన్నాడు రాజు.

"అవి స్పెషల్ సోడాలు సార్! ఒక్కోటి రూపాయి!" అన్నాడు స్టాలు వాడు. 'యీ మాత్రం తెలియదటయ్యా--కాంగ్రెస్ నాయకా!' అనే ధోరణితో ఈసడింపుగా రాజు వైపు చూస్తూ!

వెధవ సోడా రూపాయేమిటి! స్పెన్సరు సోడా కూడా ఇరవై పైసలేనే! ఇది మరీ దొంగల దోపిడిగా ఉన్నదనిపించింది రాజుకు! ఐతే ఏం మాట్లాడేందుకూ తోచక పెళ్ళి నడకలతో తన కంపార్టుమెంట్ వైపు వెళ్ళాడు.

అప్పటికే కంపార్టుమెంటులో ఒక పోలీసు ఆఫీసరు ఎక్కి ముసలాడితో మాట్లాడుతున్నాడు. ఈ ముసలాడు ఇంతకుముందు జరిగిందంతా పోలీసు ఆఫీసరుకు చెప్పి, తన వాటరు బాటిల్స్ సోదా జరిపిస్తాడేమోననే భయం పట్టుకుంది రాజుకు! ఈ ముసలాడి పలుకుబడిని వాసన పట్టే, ఆయన నాలిక దాహంతో పిడచ

కట్టుకొనిపోతూన్నప్పటికీ తన కషాయాన్ని ఇవ్వనందుకు తనను తాను అభినందించుకున్నాడు రాజు.

ఎందుకైనా మంచిదని ప్లాట్‌ఫారం మీదనే నిలబడి బండి కదిలే వేళకు పోలీస్ ఆఫీసరు దిగుతూండగా తాను ఎక్కవచ్చునని నిశ్చయించుకున్నాడు.

ప్లాట్‌ఫారం మీద నిలబడి ఆలోచించగా మరో పెద్ద ఇబ్బంది ఇది వరకులాటిదే వచ్చిపడుతూందేమోననే ఊహ వేధించింది రాజును! మళ్ళీ యీ ముసలాడికి దాహం వేస్తే తన కషాయం మీదికి దృష్టి పోనిస్తాడు! అప్పుడెలా?

లోగడ జరిగిన అనుభవంతోనన్నా యీ ముసలాడు ఒక కూజాతో నీళ్ళు తెప్పించుకోరాదూ? రూపాయి సోడాలు తానిక సరఫరా చేయలేడు! ప్లాట్‌ఫారమ్ మీద ఎక్కడా కూజాలు అమ్ముతూన్నవాళ్ళు కనిపించలేదు. అసలు యీ వెధవ జిన్ వెంట తేకుండా ఉంటే యీ క్లిష్ట సమస్యలు వచ్చి పడేవి కావు కదా!

ఇప్పటికైనా మించిపోయిందేమిటి? మెయిల్ కాస్త పరుగు లంకించుకున్నాక, రెండు వాటరు బాటిల్స్‌నూ విసిరి బైటికి పారేస్తే పీడ విరగడైపోతుంది! ఏం చేయాలనేది బండి బయలుదేరాక కాని నిర్ణయించుకునేందుకు వీల్లేదు! బైట పారవేసి తీరవలసి వస్తే పొట్టపట్టినంతగా తాగి కృష్ణార్పణంగా పారవేయటమే శరణ్యం!

బండి బయలుదేరేందుకు మొదటి గంట కొట్టారు. ముసలాడు పోలీస్ ఆఫీసరుతో చాలా కులాసా ధోరణిలో మాట్లాడుతున్నాడు. స్పెషల్ సోడా రూపాయి చొప్పున అమ్మితే అమ్మారు కాని అది ముసలాడికి దివ్యౌషధంగా పరిణమించింది!

ఇంతలోనే ఒక కానిస్టేబుల్ కూజాతో నీళ్ళూ, ఒక గ్లాసూ తెచ్చి కంపార్టుమెంట్‌లో పెట్టాడు. ముసలాడి పలుకుబడితో క్షణంలో అన్ని ఏర్పాట్లూ, ఆయనకూ ఆ మాటకొస్తే తనక్కూడా వాటంగా రూపొందించ బడినవి!

అదృష్ట దేవత తన నింకా పూర్తిగా విడనాడలేదు! న్యాయంగా (?) సంపాయించుకున్న సొమ్ముతోనే కదా-- వేంకటేశ్వరుని ముడుపు చెల్లించగా మిగిలినదాంట్లోంచేగా యీ జిన్ను కొన్నది! అది తన పొట్టలోకి పోకుండా ఉంటే వేంకటేశ్వరస్వామి మాత్రం లంచంతీసుకున్న పెద్ద మనిషిగా ఊరుకోగలడా? యీసారి గ్లాసు వేంకటేశ్వరుని పేరు మీదుగా పొట్టన పెట్టుకోవటం తన విధి!

బండి బయలుదేరుతుండగా పోలీస్ ఆఫీసరు దిగిపోవటమూ, రాజు ఎక్కటమూ జరిగింది. ముసలాడి మోహం కళకళ్లాడుతోంది; తనకు ఖర్చయిన వెధవ రెండు రూపాయిలూ సద్వినియోగమైందనే అభిప్రాయం రాజుకు కలిగింది.

"ఇప్పుడు మీకు కాస్త తేలిగ్గా వుందా?" అన్నాడు రాజు.

"కాస్త కాదు బాగా తేలిగ్గా ఉంది! సోడాలు బలే పని చేసినయ్... అన్నట్లు ఎంతైంది?" అన్నాడు ముసలాడు జేబులోంచి పర్సు తీస్తూ.

"దానిక్కూడా డబ్బా! వద్దండీ!" అన్నాడు రాజు. ముసలాడు చిరునవ్వులు చిలకరించాడు.

"మీ కషాయం జోలికి రాకుండా మంచినీళ్ళు తెప్పించుకున్నాను" అన్నాడు ముసలాడు ఎత్తిపొడుపుగా.

"చూశాను!" అని నసిగాడు రాజు.

ఇక తన కషాయానికి ఎలాటి ప్రమాదమూ లేదని తెలుసుకున్నవాడై, రాజు మొదటి గ్లాసు తన నిర్ణయాన్ని అనుసరించి వేంకటేశ్వరస్వామికి అంకితం చేశాడు.

నిద్రపొయ్యే వేళయిందనీ, యీ రాత్రి హాయిగా నిద్రపోవాలనే నిశ్చయంతో మరో రెండు గ్లాసులు తనకు తానే అంకితం చేసుకున్నాడు రాజు. మత్తులోని గమ్మత్తు రాజును ఆవరిస్తోంది.

ఆ తరువాత పై బెర్తు మీద బెడ్డింగు వేసుకొని "యిక పడుకొంటాను సార్. గుడ్ నైట్!" అని ముసలాడికి చెప్పి, పైకి ఎగబాకాడు.

ముసలాడు గుడ్‌నైట్ చెప్పి వేదాంత సంబంధమైన పుస్తకాన్ని చదువుకో సాగాడు.

రాజుకు ఆవలింతలు దొంతర్లుగా వచ్చి పడుతూన్నవి. తన కషాయానికి కాపలాగా ముసలాణ్ణి ఉంచి నిద్రపోవటం మంచిదా? కాదా? అనే తర్కం అతని మనస్సులో ప్రారంభమైంది. కూజా నిండా నీళ్ళు ఉన్నవి కనుకా తన ఖర్చు మీద సోడాలు (స్పెషల్!) బిగించాడు కనుకా ముసలాడి వల్ల ప్రమాదం ఉండదని తేల్చుకొని, యిక ఆపుకోలేని గాఢనిద్రకు ఉపక్రమించాడు రాజు.

## 4

రాజు కలగంటున్నాడు:

కూపే కంపార్టుమెంటులో అన్నులమిన్నతో సరసాలాడుతూ, తాను తందనాలాడే దృశ్యం ఆరంభమై వెనువెంటనే మాయమైంది.

ఆ యువతి స్థానంలో యిప్పుడు నిజంగానే తనతో ప్రయాణం చేస్తూ తన పాలిటి యముడైన విధంగా కన్పట్టిన ముసలాడు తయారయ్యాడు.

తన కషాయం కోసం అర్రులుజాచిన విధంగా ముసలాడు ఎగపడుతూంటే, డబ్బు పోసి కొన్నది ముక్కూ మొహం ఎరగనివాడికి పోసేందుకు యిష్టంలేక, పలుకుబడి గలవాడు కనుక చట్టానికి తనను చుట్టిపారేస్తాడేమోననే భయంచేత, చేజిక్కింది

జారిపోకుండా తగు జాగ్రత్త పడేందుకై ముందూ వెనకా చూడకుండా గడగడా రెండు బాటిల్స్‌నూ ఖాళీ చేసి పొట్ట నింపుకున్నాడు రాజు.

తన కోటా ఒక బాటిల్ అనీ, అంతకు మించితే రాంభజన మొదలూ, భరతనాట్యమూ ప్లస్ హరికథా కాలక్షేపం వరకూ జరిపించవలసి ఉంటుందనీ రాజుకు తెలుసు. కాని, పరిస్థితుల ఒత్తిడికి దాసానుదాసుడై పొట్ట పట్టకుండా తాగినందువల్ల తూలుతూ, పడుతూ, లేస్తూ పాటలూ పద్యాలూ ఆరంభించాడు. బూతుపదాల్నీ, పద్యాల్నీ రాగయుక్తంగా పాడాడు.

"భారత భూమి మనదేరా - భారతదేశం మనదేరా!" ఇత్యాది స్వంత కవిత్వాలు వినిపించాడు. ఛండాలపు పాటలు యీ కథకునికి తెలిసినా, ఐ.పి.సి. 292వ సెక్షన్ కిందికి వొచ్చే సాహిత్యం కనుక రాయకూడనివి పాడాడు.

ముసలాడు ఎంత మృదువుగా చెప్పినా కళ్ళాలు తెంచుకున్న పందెపు గుర్రాలవలె మొరాయించి, హరాము చేసే తన శక్తులు తన ఆధీనం తప్పి, తను యిష్టానుసారంగా కంపార్టుమెంటులో వివిధ నాట్యాలు - ప్రపంచం కనీ వినీ ఎరుగని వాటిని కదం తొక్కించాడు. పొట్టలోని జిన్ గలగల్లాడటం యింత గొడవలోనూ, రైలు చక్రాల మోతలోనూ సుస్పష్టంగా వినిపించింది. దానికక్కడ తావు లేకపోవటంవల్ల ఒకటికి రెండు వాంతులు ఐనవి.

"ఏయ్!ఏయ్!ఏమిటయ్యా! యీ కంపార్ట్‌మెంటంతా ఛండాలంగా కక్కావు?... అబ్బ! ఎంత ఖరాబ్ చేశావయ్యా!... పైన ముక్కులు పగిలేట్లుగా పాడువాసన! ఛీ... ఛీ!" అని ముసలాడు ముక్కు మూసుకొని చీదరించుకున్నాడు.

రాజారావు యీ మాటలకు మరింతగా మండిపడుతూ "ఏమన్నావ్! నన్నూ, నా వాంతుల్నీ దూషిస్తావురా! దుందుభీ విను:" అని పాటలు తగులుకున్నాడు:

నా వాంతుల కాంతులు
ఇంతుల బంతుల తుంపులు
నారుల నవనవ సొంపులు
వనితల దేహపు వొంపులు
నాతుల మూతుల కంపులు

మగువల మాటల గలగల
పురుషుల దేహపు జిలజిల
కాంతల కన్నుల మిలమిల
పురుషుల గుండెల దడదడ

నీ బాడీ బిగిసిన కొక్కెము
మనసిజు ఎగసిన టెక్కెము

నీ లంగా కల్గిన కుచ్చులు
నీ పన్నిన వలపుల ఉచ్చులు
మగువల మనసుల దినుసులు
పండితు వాక్కున పనసలు
నా కన్నులకే మహదానందం
నీ వలపుల మూటల చందపు అందం!
అవ్వంటయ్ 'నీ చేతుల కందం-అందం!'
అది వింటుంటే కూలిందా మహదానందం!

పాటకు లయగా దరువేస్తూ అవసరమైనచోటే కాకుండా, అనవసరమైన చోట కూడా రాగాలు తీశాడు.

నాట్యం చేస్తూ భారత ప్రభుత్వానికి చెందిన డిమ్‌లైట్ నౌకదాన్ని తునాతునకలు చేశాడు. గాంధీ టోపీని నెత్తిమీద ఏటవాలుగా పెట్టుకొని సిగ్గు నటిస్తూ "తుంహారా బీబీకి ఇది హాబీ!" అని ఒక పాట పాడి రాజభాషా గౌరవమున్న హిందీకి ఇంగ్లీషు కూడా జోడించి తన ప్రతిభ చాటుకున్నాడు.

ముసలాడు నిస్సహాయ స్థితిలో పడి ఎంత చెప్పినా కంట్రోల్ చేయలేని రాజు విషయంలో భయపడిపోయి - గొలుసు లాగి బండి ఆపించాడు.

జన సమూహాలు కంపార్టుమెంటును ముట్టడించటం, పోలీసువారు రాజు చేతులకు బేడీలు వేయటంతో రాజు నిషాతో పాటు, నిద్రమైకం కూడా వదిలిపోయింది.

నిద్ర మెళుకూ రాగానే చేతులు ఝాడించి చూసుకొని, బేడీలు తన చేతులక్కాదని తెలుసుకున్నాడు. లయ వేసుకుంటూ రైలు సాగిపోతోంది. తన వాటరు బాటిల్స్ మృదువైన నాట్యం చేస్తూ ఊగుతున్నవి.

ఇదంతా కల అని తెలుసుకున్నాక రాజు మనస్సు కుదుటబడింది.

ముసలాడు మహదానందంగా ఉన్నట్టున్నాడు. రాత్రి గడిచిపోతున్నా ఇంకా చదువుతూనే ఉన్నాడు. గడియారం చూసుకొని పన్నెండున్నరయిందని తెలుసుకున్నాడు రాజు.

ముచ్చటగా ముందుకూ వెనక్కూ ఊగుతున్న ప్లాస్టిక్ వాటరు బాటిల్స్ రాజును ఆహ్వానించినవి.

పై బెర్తు మీది నుంచి లంకలోకి దూకే హనుమంతుడివలె దూకి, ఒక గ్లాసుకు ద్రావకాన్ని నింపాడు. పెదవుల దగ్గిర పెట్టుకునేప్పటికి చల్లగా తియ్యగా పచ్చి మంచినీళ్ళు!

జిన్ స్టాకు ఉంటే నీళ్ళవుతయ్యని ఎన్నడూ తాను వినలేదు. ఆ గ్లాసులోది అవతల పారబోసి, రెండో బాటిల్ నిండుగా ఉన్నదాన్ని విప్పితే అదీ అంతే! తన కషాయం గంగా తీర్థపు అవతారాన్ని దాల్చింది! రాజు ముఖం కూడా మాడి మసిబొగ్గయింది!

ముసలాడు క్రీగంట చూస్తూ చిరునవ్వులు చిందిస్తున్నాడు. ఇదంతా ముసలాడి మాహాత్మ్యమేనని రాజు గ్రహించేందుకు ఎక్కువసేపు పట్టలేదు.

ఐతే ఏమని అడుగుతాడు? 'నా జిన్ ఎందుకు మింగావు' అంటాడా? 'కషాయం కాస్తా హరించావేమయ్యా!' అంటాడా?

గుడ్లు మిటకరిస్తూన్న రాజును చూసి ముసలాడు "కాంగ్రెస్ నాయకా! రా. ఇటు ఆశీనుడవుకా!... ఏం గొప్ప కషాయం తెచ్చావయ్యా! అసలు నేను అడిగినప్పుడేనా మొహాన ఒక గ్లాసు పడవేసి వుంటే ఆయాసం యీ పొలిమేర్లకు వచ్చి ఉండేదా? నీ ప్రో ప్రొహిబిషన్ వాదాలు చూసి నేను సాహసించలేదు కాని లేకుంటే నేనే నీకింత 'సుర' అందించేవాణ్ణి! నిజమైన రాజకీయవాదివి కనుకనే ఆ స్పెషల్ సోడాలు సాధించావ్. ఒక దాంట్లో మైల్డ్‌గా బ్రాందీ, మరొకదాంట్లో మైల్డ్‌గా విస్కీ - నీ అభిరుచులకు అనుగుణంగానే అవి అందించబడినవి. అవి పుచ్చుకున్నాక ప్రాణం శాంతించిందనుకో! నీ బోటి జంబుకాన్ని నేను వాసనపట్టలేననుకున్నావా! నిశ్చయంగా తెలుసుకుందామనే వేచి ఉన్నాను. ఐదు గ్లాసులు పుచ్చుకున్నావో లేదో సుఖనిద్ర పోక ఆ పాటలేమిటి? అలాటి అద్భుత గానం విని ఎన్నాళ్ళయిందో! పై బెర్త్ మీద నుంచి విననయే ఆ గానామృతానికి తోడుగా మీరు వేసిన దరువు అద్భుతం! మద్రాసులో తమకో పార్టీ ఏర్పాటు చేయించి నా మిత్ర బృందం సమక్షంలో మీ కుప్పిగంతులూ, ఆ బూతు పాటలు అవీ ఒక వెరైటీ ఎంటర్‌టైన్‌మెంట్ పెట్టించాలని నిశ్చయించుకున్నాను" అన్నాడు.

తీర్పు వింటూన్న ఖూనీ నేరస్థుని స్థితి ఇప్పుడు రాజుకు బాగా అర్థమౌతోంది. కలలో కలవరింతలు కూడా అవతరించినవన్నమాట! ఇంకానయం డాన్స్ చేస్తూ పై బెర్త్ మీద నుంచి ముసలాడి మీదికి పడి హత్య చేయటమూ, తన నడుం విరగ్గొట్టుకోవడమూ జరగలేదు. ఇంతకూ ముసలాడు తన జిన్ మింగితే మింగాడు ఇప్పుడింకో ప్రమాదం తెచ్చి పెట్టకుండా ఉంటే అదే పదివేలు! రూపాయి సోడాల రహస్యం యిప్పుడే రాజుకు అర్థమైంది!

"మొదట మీరు ఎత్తుకున్న ఇష్ట దేవతా ప్రార్థన 'ముందుగా వాల్మీకి...' అత్యద్భుతం! మీ అభిరుచుల్ని నేనెంతో అభినందిస్తున్నాను. ఇప్పుడు మీ జిన్ కాస్తా మాయమై హిమవన్నాగన్నుంచి పారిన గంగోదక రూపం దాల్చిందని బాధపడకండి. నా పక్కన కూర్చొని యీ ఫారిన్ సరుకు కాస్త రుచి చూసి మీ గానకళామృతంతో నా చెవుల్లోని

తుప్పుతోపాటు వెంట్రుకల్ని కూడా పెకలించండి...గాంధీ టోపీ పెట్టుకుంటేనే మీ అందం ఇనుమడిస్తుంది... రండి!" అని రాజుచేత గాంధీ టోపీ ధరింపజేసి బెర్తు కింద ఉన్న పెట్టెలోంచి 'ఓల్డ్ స్మగ్లర్' బుడ్డి బైటికి లాగాడు.

ఆ బుడ్డి చూస్తేనే ఎంతవాడికైనా లోపలి సరుకు రుచి చూడాలనిపిస్తుంది. ముసలాడి పెట్టె నిండా ఉన్న బాటిల్స్ చూసేటప్పటికి రాజు కళ్ళు జిగేల్‌మన్నవి!

మెరిసిపొయ్యే ద్రవాన్ని రెండు గ్లాసుల్లోను వొంచి "ప్రస్తుతం సోడాలు లేవు కనుక నీళ్ళు కలిపి సేవిద్దాం!" అన్నాడు ముసలాడు. తనకు గురు సమానుడైన ముసలాడి మాటను కాదనలేకపొయ్యాడు రాజు.

"మీ ఎడ్రస్ ఇవ్వండి. మద్రాసులో మీకు కొన్ని బుడ్లు హోమ్ డెలివరీ చేస్తాను... ఇక ముందు మాత్రం ప్రో ప్రొహిబిషన్ మాటలు మాట్లాడకండి!" అని హెచ్చరించాడు ముసలాడు.

"మంచీ మర్యాదా ఉండొద్దండీ!" అన్నాడు రాజు.

"దానికి నీ టోపీయే చాలయ్యా!... అది సరేకాని కాస్త పాటలు పాడు రంజుగా ఉంటుంది!"

రాజు మొదట్లో సిగ్గుపడ్డాడు; కాని, మూడో రౌండ్ కాగానే కంపార్టుమెంట్ దద్దరిల్లేలా రాం భజన ఆరంభించాడు. ముసలాడు కూడా శృతి కలపటంతో మహదానందంగా ఉన్న - చట్టాన్ని ధిక్కరించిన ఆ ఇద్దరు చుట్టాలనూ మెయిల్ అతి వేగంగా మరింత హుషారుగా మోసుకొని వెళ్ళసాగింది.

- సెప్టెంబర్, *1963*